సాక్షి పెద్దపల్లి

సోమవారం ၊ 7 ၊ ఆగస్టు ၊ 2023



ఆన్‌లైన్‌లో స్టాంపు పేపర్ల విక్రయం

స్టాంపు పేపర్ల అమ్మకాలన్నీ ప్రభుత్వ పనిదినాల్లో, పని వేళల సమయంలో మాత్రమే విక్రయించేలా తెలంగాణ సర్కార్ యాప్ రూపొందించింది. 8లో▸



శరణు శరణు మల్లన్న

ఓదెల: ఓదెల మల్లిఖార్జునస్వామి సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. స్వామివారికి భక్తులు పట్నాలతో పాటు బోనం తదితర మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.0

ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు 8,475 'గృహలక్ష్మి' ఇళ్లు కేటాయింపు



ముజమ్మిల్ ఖాన్, కలెక్టర్

పెద్దపల్లిరూరల్: గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం జిల్లాకు 8,475 ఇళ్లు కేటాయించిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అర్హులు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాలకు 3వేల చొప్పున, మంథని నియోజకవర్గానికి 1,500, ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండలానికి 975 ఇళ్లు మంజూరైనట్లు కలెక్టర్ వివరించారు. దరఖాస్తులను మండల, మున్సిపాలిటీ, జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సమర్పించాలని కోరారు. అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి 20లోగా పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి సొంత ఇంటి స్థలంతో పాటు ఆహార భద్రత కార్డు ఉండాలని వివరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా జరుగుతుందని, దళారులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇళ్లు మంజూరు చేయిస్తామంటూ ఎవరైనా డబ్బు అడిగితే సమీపంలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.

జిల్లా కోర్టు సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేయాలి



హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులతో బాలకిషన్ ప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లా కోర్టును పెద్దపల్లిలో అనువైన స్థలంలో లేదా సుల్తానాబాద్ కోర్టు ఎదుట ఖాళీగా ఉన్న భవనంలో ఏర్పాటు చేయాలని సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్ ప్రసాద్ కోరారు. పెద్దపల్లి మండలం కన్నాలలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఈ విషయమై తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కోర్టును కొందరి ప్రయోజనం కోసం కన్నాలలో ఏర్పాటు చేయడం సరికాదని హైకోర్టు పోర్టు పోలియో జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డికి విన్నవించినట్లు పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లో పాత కోర్టు భవనం బాగానే ఉందని, స్థలం సైతం ఎక్కువగా ఉండటంతో కక్షిదారులు, న్యాయవాదులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సుల్తానాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జిల్లా జడ్జి హేమంత్‌కుమార్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొన్నారు.

ఎస్సైలుగా ఎంపికైన కానిస్టేబుళ్లు



మధుకర్



చంద్రశేఖర్

మంథని: మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన బుద్దార్థి మధుకర్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఆదివారం విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో మంథని నుంచి పలువురు అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. కాగా మధుకర్ హైదరాబాద్‌లోని టీఎస్‌ఎస్‌పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

పాలకుర్తి(రామగుండం): మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన బుట్టి చంద్రశేఖర్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా గుడిపేట బెటాలియన్లో టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈసందర్భంగా అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో శ్రీనివాసరెడ్డి, ఆశావర్కర్లు

పెద్దపల్లిరూరల్: ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఐటీఐ ఆవరణలో ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూపతో కలిసి మాట్లాడారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న ఆశావర్కర్ల సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అధిక పనిభారం తగ్గించి, ఆరోగ్య బీమా అమలు చేసి, కనీసవేతన చట్టం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం పోస్టులను అర్హత గల ఆశావర్కర్లకే ఇవ్వాలన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో జ్యోతి, రజిత, లక్ష్మి, మమత, రాజేశ్వరి, కరుణ, పద్మ, స్వప్న శోభ, సరోజన, జ్యోత్స్న, ప్రమీల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం 532 మెగావాట్లు



ఆర్జీ–3 ఏరియాలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్

- కార్బన్ ఉద్గారాలు లేని సంస్థగా సింగరేణి
- రెండోదశ 232 మెగావాట్ల సోలార్ విద్యుత్‌కు రంగం సిద్ధం
- ఇప్పటికే 224 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి
- తుది దశలో మరో 76 మె.వా ప్లాంట్లు
- వచ్చే నెలలో నూతన టెండర్ పక్రియ

గోదావరిఖని(రామగుండం): సోలార్ విద్యుత్ ఉత్పాదన రంగంలో సింగరేణి దూసుకుపోతోంది. 2018లో ప్రారంభమైన సోలార్ విద్యుత్ ఉత్పత్తి 300 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఏటా గనులు, కార్మిక వాడలకు 750విలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తోంది. దీనికోసం ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ రూ.420 కోట్లు ట్రాన్స్‌కోకు చెల్లిస్తోంది. ఈ ఖర్చును తగ్గించేందుకు సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్ సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించారు. 9 ప్లాంట్ల ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 717.02 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. దీంతో సింగరేణి చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల్లో రూ.250 కోట్లు ఆదా అయ్యాయి.

వచ్చే నెలలో టెండర్లు..

మొదటి దశలో 300 మెగావాట్ల సామర్థ్యంతో 14 ప్లాంట్లను 8 ఏరియాల్లో నిర్మించారు. వీటిలో ఇప్పటికే 224 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు పూర్తికాగా, ఇంకా 76 మెగావాట్ల ప్లాంట్‌లు చివరి దశలో ఉన్నాయి. రెండో దశలో 232 మెగావాట్ల సామర్థ్యంతో 8 ఏరియాల్లో ప్లాంట్లు నెలకొల్పడానికి రంగం సిద్ధం చేసింది. సోలార్ ప్లాంట్లకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసి వచ్చే నెలలో టెండర్లు పిలవనున్నారు. అక్టోబర్ నుంచి నిర్మాణాలు ప్రారంభించాలని, మిగిలిన 76 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను అక్టోబర్ వరకు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈక్రమంలో సంస్థలో 532 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనతో కంపెనీని నెట్‌జీరో కార్బన్ ఎమిషన్ కంపెనీగా నిలపాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

పూర్తయిన సోలార్ విద్యుత్ ప్లాంట్ల వివరాలు..

ఏరియా	సామర్థ్యం మెగావాట్లు	ఉత్పత్తి మి. యూ
ఎస్టీపీపీ	10	45.52
ఆర్జీ–3	50	90.80
మణుగూరు	30	111.42
ఎస్టీపీపీ(ఫ్లోటింగ్)	5	1.88
భూపాల్‌పల్లి	10	30.19
కొత్తగూడెం	37	84.49
ఇల్లెందు	39	116.48
మందమర్రి స్టేజీ–1	28	186.34
మందమర్రి స్టేజీ–2	15	49.90
మొత్తం	224	717.02

8 ఏరియాల్లో..

సంస్థవ్యాప్తంగా 8 ఏరియాల్లో కొత్త సోలార్ ప్లాంట్లు నిర్మించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మందమర్రిలో 67.5, ఆర్జీ–3లో 37 , సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 37.5, సత్తుపల్లిలో తొలిసారిగా 32.5, శ్రీరాంపూర్ ఏరియాలో తొలిసారిగా 27.5, ఇల్లెందులో 15, భూపాలపల్లి ఏరియాలో 10, ఆర్జీ–1 ఏరియాలో తొలిసారిగా 5 మెగావాట్ల ప్లాంట్లను నెలకొల్పాలని నిర్ణయించారు.

జైపూర్‌లో సోలార్ ఫ్లోటింగ్ ప్లాంట్

రాష్ట్రంలో తొలిసారి ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ (నీటిపై తేలియాడే)ను జైపూర్‌లో నెలకొల్పేందుకు సింగరేణి ఏర్పాట్లు చేసింది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నీరందించే రిజర్వాయర్‌పై 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను నిర్మించారు.

శరవేగంగా సోలార్ ప్లాంట్లు



సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తాం. ఇప్పటికే 224 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇంకా 76 మెగావాట్ల ప్లాంట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి 532 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. కార్బన్ ఉద్గారాలు లేని సింగరేణి సంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

– జానకీరాం, సోలార్ జీఎం, సింగరేణి

సింగరేణి పరిరక్షణకు | గళమెత్తిన గద్దర్



బహిరంగసభలో ఆటాపాటతో గద్దర్ (ఫైల్)

- కార్మికుల్లో చైతన్యం రగిలించిన ప్రజాగాయకుడు
- సింగరేణితో విడదీయరాని అనుబంధం



సింగరేణిలో చైతన్య యాత్రలో గద్దర్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): ప్రజాగాయకుడు, యుద్ధనౌక గద్దర్‌తో సింగరేణికి విడదీయరాని అనుబంధం ఉంది. సింగరేణి పరిరక్షణకు గోలేటి నుంచి కొత్తగూడెం ద్వారా చైతన్య యాత్ర నిర్వహించి కార్మికుల్లో చైతన్యాన్ని రగలించారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని గనులపై మీటింగ్‌లు నిర్వహించి యాజమాన్యం, రాష్ట, కేంద్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ఏఐటీయూసీతో కలిసి సంస్థ పరిరక్షణ యాత్ర నిర్వహించి కార్మికుల వెన్నంటి ఉంటానని శపథం చేసి ధైర్యాన్ని కల్పించారు. ఇలా కార్మికులతో విడదీయరాని అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. గద్దర్ ఆకస్మిక మృతితో ఈప్రాంతంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ఒక శకం ముగిసింది

గోదావరిఖని/కోల్‌సిటీ: ఆట, పాటకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతితో కళారంగంలో ఒక శకం ముగిసిందని తెలంగాణ ప్రజానాట్యమండలి, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రతినిధులు కవ్వంపల్లి స్వామి, కన్నం లక్ష్మీనారాయణ, చీకటి అంజయ్య, ఇనుముల రాజమౌళి, ఎజ్జ రాజయ్య, వై.లెనిన్ ప్రకటనలో తెలిపారు. గద్దర్ మృతికి వారు ప్రగాఢ సంతాపం తెలిపారు. గోదావరిఖనిలో జరిగిన పలు ప్రజా చైతన్య ఉద్యమ కార్యక్రమాల్లో గద్దర్ స్వయంగా పాల్గొన్నారని, ఆయనతో కలిసి కార్యాక్రమాల్లో పాల్గొన్న సందర్భాలను గుర్తు చేశారు. కళా ప్రదర్శనకు తనదైన ఆహార్యాన్ని రూపొందించుకొని, అందరూ అదే అనుసరించేలా, గోచి, గొంగడి, గజ్జెలు పాటల దళానికి ఒక ప్రత్యేకతను కలిగించే విధంగా విశ్వవ్యాప్తం చేసిన జనగాయకుడు గద్దర్ అన్నారు. అజ్ఞాతంలో, జనజీవన స్రవంతిలో 60 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రజలకే అంకితం చేసిన త్యాగశీల కళాకారుడు గద్దర్ అని, తానొక్కడే ఒక సైన్యంగా బూర్జువా రాజకీయాలను చీల్చి చెండాడి, దళితులు, పీడితులు, తాడితుల కోసం అహర్నిషలు శ్రమించి పరితపించిన చైతన్యమూర్తి గద్దర్ అంటూ ఉద్యమ స్ఫూర్తిని అభినందించారు.

రామగుండం రైల్వేస్టేషన్‌కు మహర్దశ



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ



ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

- రూ.26.50 కోట్లతో ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన
- వర్చువల్ విధానంతో ప్రారంభించిన ప్రధాని మోదీ

రామగుండం: అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల జాబితాలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో తొలి దశలో కరీంనగర్, రామగుండం, రెండో దశలో పెద్దపల్లి రైల్వేస్టేషన్లకు చోటు లభించింది. ఇందులో భాగంగా రూ.26.50 కోట్ల నిధులతో ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరణ పనులను దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

శిలాఫలకం ఆవిష్కరణ

రామగుండం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల శిలాఫలకాన్ని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ డాక్టర్ వివేక్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, రైల్వే సీనియర్ డీఎంఈ శ్రీనివాస్ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం రైల్వేస్టేషన్ ఎదుట ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ ప్రముఖులు క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. రైల్వే వ్యవస్థపై స్థానిక నవోదయ హైస్కూల్ విద్యార్థుల చిత్రలేఖ ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు రైల్వే అధికారులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రైల్వేలో ప్రజావసరాలను గుర్తించి అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల జాబితాలో రామగుండం స్టేషన్‌ను చేర్చి ప్రధాని మోదీ ఎంతగానో అభివృద్ధికి పాటుపడుతున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నూరి సతీష్‌కుమార్, కౌశిక లత, రైల్వే ప్రజాసంబంధాల సభ్యుడు క్యాతం వెంకటరమణ, బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.మల్లికార్జున్, బీఈఎంఎల్ బోర్డు సభ్యురాలు బల్మూరి వనిత, సోమారపు లావణ్య, బీజేపీ సీనియర్ నాయకుడు కౌశికహరి, సోమారపు అరుణ్‌కుమార్, రాపోలు కుసుమకుమారి, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భానుచందర్, టీటీఈ మాడిశెట్టి శ్రీనివాస్, వాణి, ఐఓడబ్ల్యు రాంబాబు, గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సైలు సంతోష్‌కుమార్, వెంకట్, రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్, జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తదితరులున్నారు.

జయశంకర్ సార్ ఆశయాలు సాధిద్దాం



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలకనుగుణంగా ముందుకు సాగుదామని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం జయశంకర్ జయంతోత్సవ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న జయశంకర్ సార్‌కు రాష్టసాధనలో పోషించిన భూమిక కీలకమన్నారు. ఆర్డీఓ మధుమోహన్, సేఓ శ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు. పెద్దపల్లి మున్సిపల్ ఆఫీసు ఆవరణలో చైర్‌పర్సన్ మమతారెడ్డి పాల్గొని నివాళులర్పించారు. కమిషనర్ వెంకటేష్, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్, జెడ్పీటీసీ రామ్మూర్తి, నాయకులు రవీందర్, మధు, తదితరులున్నారు.

బండెనక బండికట్టి..



పాలకుర్తి(రామగుండం): రైతు రుణమాఫీపై సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని హర్షిస్తూ పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆదివారం కుక్కలగూడుర్‌లో 11 ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించి 'థ్యాంక్స్ టూ కేసీఆర్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ, కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రెండో ఏఎన్‌ఎంల పోరుబాట

- ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి
- పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్
- నేటి నుంచి క్లస్టర్ల వారీగా సమ్మెకు పిలుపు



ఇటీవల తమ సమస్యలపై అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తున్న రెండో ఏఎన్‌ఎంల యూనియన్ ప్రతినిధులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్ఎంలు పోరుబాట పట్టారు. దాదాపు 20 ఏళ్లుగా మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, అయినా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టుల్లో తమను రెగ్యులర్ చేయాల్సింది పోయి ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆగ్రహంగా ఉన్నారు. నోటిఫికేషన్‌తో ఏళ్లుగా సేవలందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో 18 ప్రాథమిక, 6 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా దాదాపు 136 మంది రెండో ఏఎన్‌ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. రెండో ఏఎన్‌ఎం యూనియన్ పిలుపు మేరకు సోమవారం నుంచి జిల్లా కేంద్రాలతో పాటు క్లస్టర్ల వారీగా సమ్మెకు పిలుపునిచ్చారు.

వినతులు, పోరాటాలు..

- నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా 2007లో రెండో ఏఎన్‌ఎంలు విధుల్లో చేరగా, అప్పుడు వీరి వేతనం రూ.4,200.
- ప్రభుత్వం 2017లో రూ.25వేలకు పెంచింది. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో మొదటి ఏఎన్‌ఎంలకు దీటుగా వీరు పనిచేస్తున్నారు.
- తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించి, హెల్త్‌కార్డులు జారీ చేయాలని రెండో ఏఎన్‌ఎంలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.
- దురదృష్టవశాత్తు చనిపోతే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి అర్హతను బట్టి కారుణ్య నియామకం చేపట్టాలని ఎమ్మెల్యేలు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చి సమ్మె సైతం చేశారు.
- కాగా సమ్మె చేసినప్పుడు పరిశీలిస్తామని హామీ ఇచ్చిన పాలకులు తర్వాత ఆ అంశాన్ని పక్కన పెడుతూ వచ్చారు.
- రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తోందని, తమపై వివక్ష చూపుతుందని వాపోతున్నారు.
- ఇటీవల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న ఏఎన్‌ఎంలపై దాడి చేయడమే కాకుండా ఎక్కడికక్కడే అక్రమ అరెస్టులకు నిరసనగా జిల్లా కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనలు చేపట్టారు. అనంతరం స్థానిక అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

పోరాటం సాగుతుండగానే నోటిఫికేషన్

ఒకవైపు సెకండ్ ఏఎన్‌ఎంలు తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుండగానే ప్రభుత్వం 1,500 ఏఎన్‌ఎంల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో సెకండ్ ఏఎన్‌ఎంలలో ఆందోళన నెలకొంది. 20 ఏళ్లుగా చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్న తమను ఎప్పటికైనా రెగ్యులర్ చేయకపోతారా అని ఆశగా ఎదురు చూస్తున్న వారికి తాజాగా ప్రభుత్వం షాక్ ఇచ్చింది.

క్రమబద్ధీకరించాలి



మా ఉద్యోగాల క్రమబద్ధీకరణపై ప్రకటన చేయాలి. మంత్రి హరీశ్‌రావు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. మొదటి ఏఎన్‌ఎంలకు సమానంగా పనిచేస్తున్నం. పనికితగ్గ వేతనం ఇవ్వాలి.

– గొర్లె స్వరూప, రెండో ఏఎన్‌ఎం, గర్రెపల్లి

నోటిఫికేషన్ రద్దు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలి. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది.

– సునీత, రెండో ఏఎన్‌ఎం, పెద్దపల్లి

మాతోనే ప్రభుత్వానికి గుర్తింపు



రెండో ఏఎన్‌ఎంల సేవలతోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక అవార్డులు కైవసం చేసుకుంది. ప్రభుత్వ స్కీం ఎన్‌హెచ్‌ఎం అని చెప్పి దాటవేసే ధోరణి సరికాదు. మా సమస్యలు పరిష్కరించి రెగ్యులర్ చేయాలి.

– నిర్మల, రెండో ఏఎన్‌ఎం, కొలనూరు

సమ్మెకు సిద్ధం



సోమవారం నుంచి రాష్ట్ర పిలుపు మేరకు క్లస్టర్ల వారీగా సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రెగ్యులర్ చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదు.

– రమ, రెండో ఏఎన్‌ఎం, జూలపల్లి

క్లుప్తంగా

అల్లీపూర్‌లో దొంగతనం

3 తులాల బంగారం, రూ.లక్ష చోరీ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు రవీందర్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ పాల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం పాలు సేకరించేందుకు ఇంటి తలుపులు దగ్గరకు వేసి, కుటుంబసభ్యులతో కలిసి డెయిరీ ఫాం వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉంది. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, రూ.లక్ష ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మల్లాపూర్‌లో చోరీ

ధర్మారం: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన జుట్టు లక్ష్మణ్ ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. లక్ష్మణ్ ఆదివారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లిపోయాడు. వృద్ధురాలైన అతని తల్లి లచ్చమ్మ ఇంట్లో ఉండి, మధ్యాహం పక్కింటికి వెళ్లింది. ఈ సమయంలో దొంగలు ఇంటి తలుపులను తొలగించి, లోపలికి ప్రవేశించారు. బీరువాలోని రూ.24 వేలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ అనిల్, ధర్మారం ఎస్సై అశ్విని సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. క్లూస్ టీం సభ్యులు వెలిముద్రలు సేకరించారు. ఈ ఘటనపై లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

పెద్దపల్లిరూరల్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని జిల్లా ప్రజా రచయితల సంఘం నాయకులు ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యపర్చేందుకు గజ్జె కట్టి, ఆడిపాడిన మహనీయుడని కొనియాడారు. ఎందరో పోరాటయోధులు నేలకొరిగినప్పుడు నివాళులర్పించిన మహా వ్యక్తి అని నాయకులు ఏలేశ్వరం వెంకటేశం, బుర్ర తిరుపతి, నారాయణ, జిగురు రవీందర్, వెంకటేశం, ప్రజాఫంట్ నాయకులు గుమ్మడి కొమరయ్య, గాండ్ల మల్లేశం, పౌర హక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి డొంకెన రవీందర్ పేర్కొన్నారు.

'యుద్ధభేరి' విజయవంతం చేయాలి

ఓదెల(పెద్దపల్లి): రాజ్యాధికార సాధనకు ఈనెల 13న కోరుట్లలో తలపెట్టిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల రామ్మూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో పద్మశాలీలు వస్త్రోత్పత్తి సృజనాత్మకతలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. అత్యధికంగా విస్తరించి ఉన్న పద్మశాలీలను సంఘటితం చేసేందుకు కోరుట్ల యుద్ధభేరద్దేర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామల నుంచి యుద్ధభేరికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయిరి మహేందర్, చీకట్ల మొండయ్య, మండల అధ్యక్షుడు పర్శ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో స్టాంపు పేపర్ల విక్రయం

- రిజిస్టర్‌లో వివరాలు రాసే పద్ధతికి స్వస్తి పలికిన ప్రభుత్వం
- ఆదాయం అంతంతమాత్రమే..
- కమీషన్ పెంచాలని కోరుతున్న స్టాంపు వెండర్లు
- జిల్లాలో 28 మంది



పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పెద్దపల్లిరూరల్: ఆస్తుల విక్రయ ఒప్పందాలు, రిజిస్ట్రేషన్ సమయాల్లో వీలునామా ఇతర వ్యవహారాల్లో అంగీకారపత్రంగా రాసేందుకు నాన్ జ్యుడీషియల్(స్టాంపు పేపర్లు) బాండ్లు అవసరం. పాత పద్ధతిలో స్టాంపు వెండర్ తన వద్ద ఉన్న రిజిస్టర్‌లో కొనుగోలుదారుడి పేరు, చిరునామా రాసి సంతకం తీసుకొని, విక్రయించేవారు. కానీ గత నెల నుంచి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. స్టాంపు పేపర్ల అమ్మకాలన్నీ ప్రభుత్వ పనిదినాల్లో, పని వేళల సమయంలో మాత్రమే విక్రయించేలా యాప్ రూపొందించింది. ఆన్‌లైన్‌లో విక్రయించే పద్ధతిని అమల్లోకి తీసుకువచ్చింది. పెద్దపల్లి జిల్లాలో 28 మంది స్టాంపు వెండర్లు ఉన్నారు.

పాత తేదీల్లో పేపర్లకు చెక్

ఆన్‌లైన్ విధానంతో పాత తేదీలతో స్టాంపు పేపర్లు విక్రయానికి చెక్ పెట్టినట్లయింది. తమకు పాత తేదీతో పేపర్లు కావాలనేవారికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కొందరు వ్యక్తులు అధికంగా సొమ్ము తీసుకొని, విక్రయించే పరిస్థితులుండేవి.

యాప్‌లో వివరాలు నమోదు చేశాకే..

ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో స్టాంపు పేపర్ కొనుగోలుదారుడి పేరు, తండ్రి పేరు, నివాసం, ఈ–మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, ఎందుకోసం కొనుగోలు చేస్తున్నారనే వివరాలను నమోదు చేసిన తర్వాత పేపర్ అందించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో స్టాంపు వెండర్లు తప్పనిసరిగా ఇంటర్నెట్ సౌకర్యంతోపాటు కంప్యూటర్, ప్రింటర్ సమకూర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. యాప్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత బాండ్ పేపర్‌పై ప్రింట్ తీసి, ఇవ్వాల్సి ఉంటుంది.

పెట్టుబడి భారం అంటున్న వెండర్లు

పాత పద్ధతిలో ఎవరు ఏ సమయంలో స్టాంపు పేపర్ కోసం వచ్చినా వెండర్లు రిజిస్టర్‌లో పేరు, ఊరు వివరాలు రాసి, సంతకం తీసుకొని, ఇచ్చేవారు. ప్రస్తుతం కంప్యూటర్‌లో వివరాల నమోదు చేసి, ప్రింట్ తీసి, ఇవ్వాల్సి రావడంతో పెట్టుబడి భారంతోపాటు వచ్చే ఆదాయం కూడా అంతంత మాత్రమేనని వాపోతున్నారు. స్టాంపు విలువపై ఇచ్చే 5 శాతం కమీషన్ ఎటూ సరిపోదంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కమీషన్ పెంచేందుకు ఆలోచన చేయాలని కోరుతున్నారు.

పారదర్శకంగా జరగాలనే..

స్టాంపు పేపర్ల విక్రయాలు పారదర్శకంగా జరగాలన్న ఆలోచనతోనే ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇంతకాలం మాన్యువల్ పద్ధతిలో అమ్మిన వెండర్లు ఆన్‌లైన్ విధానంపై అవగాహన పెంచుకుంటున్నారు.

– సురేశ్, సబ్ రిజిస్ట్రార్, పెద్దపల్లి

స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస గౌరవమేది?

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా పోయిందని, సర్పంచ్, ఎంపీటీసీ సహా ఇతర ప్రతినిధులంతా ఆవేదన చెందుతున్నారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచులు గ్రామాల్లో చేపట్టే హైమాస్ట్ లైట్లు, విద్యుత్‌బల్బుల ఏర్పాటు పనులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నాసిరకంగా చేసి అధిక మొత్తంలో బిల్లులు పొందాడని ఆరోపించారు. సర్పంచులను అప్పుల ఊబిలోకి నెట్టాడన్నారు. కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, గంట రమేశ్‌లపై బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలు నిరాధారమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో గెలిచేందుకు ఈ నేతలే కీలకంగా పనిచేశారని గుర్తు చేశారు. ఆ నేతలంతా వారి అనుచరగణంతో కాంగ్రెస్‌లో చేరితే అక్కసెందుకని ప్రశ్నించారు. పెద్దపల్లి మున్సిపాలిటీ ఎమ్మెల్యేకు ఏటీఎం కార్డుగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ, ఆలయ భూములను ఆక్రమించుకున్న ఎమ్మెల్యేపై పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామన్నారు. బీఆర్ఎస్‌కు ఇవే ఆఖరు ఎన్నికలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, అన్నయ్య, సారయ్య, మల్లయ్య, ప్రకాశ్‌రావు, సుభాష్‌రావు, శ్రీమాన్, సంపత్, వీరేశం, జగదీశ్, తిరుపతి, మసూద్ తదితరులున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా తొలి దశ ఉద్యమానికి ఊపిరి, మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారన్నారు. బంగారు తెలంగాణ స్ఫూర్తి దాత అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు మల్లికార్జున్, తిరుపతి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, జక్కుల దామోదర్‌రావు, పాషా, సదయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

రెండోరోజూ లైబ్రరీ ఫెస్టివల్



వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ రఘువీర్‌సింగ్

పెద్దపల్లిరూరల్: ఢిల్లీలో జాతీయస్థాయి లైబ్రరీ ఫెస్టివల్ రెండోరోజు ఆదివారం కొనసాగింది. వేడుకల్లో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారన్నారు. పాఠకులకు మరింత మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారన్నారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి గ్రంథ పాలకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారని తెలిపారు.

కళాకారుల కుటుంబాల ఫ్రెండ్‌షిప్ డే



ఒక్కచోట చేరిన కళాకారుల కుటుంబసభ్యులు

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన కళాకారుల కుటుంబాలు ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే నిర్వహించుకున్నాయి. గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలోని గాంధారి మైసమ్మ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడే వన భోజనం చేశారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని, కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కళాకారుల ప్రదర్శనలు, స్నేహం గొప్పదనాన్ని తెలిపే పాటలు అలరించాయి. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కనకం రమణయ్య, మాదరి వాసు, కళాకారులు వెంకటి, రాజమౌళి, రాజేశం, ధన్‌సింగ్, రవీందర్, పెద్దయ్య, యూసుఫ్, శివ, సదానందం, శ్రీనివాస్, అంజలి, పద్మ, మేజిక్ హరి, చంద్రపాల్, లలిత, లక్ష్మి, శాంత, మధునమ్మ, సంజన పాల్గొన్నారు.

యాదవ గర్జనకు తరలిరండి



కమిటీని సత్కరించిన రమేశ్ యాదవ్

పెద్దపల్లిరూరల్: యాదవుల సమస్యపై పోరాడుదామని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెగడ రమేశ్‌యాదవ్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీలో జాప్యం చేస్తుండటంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. యాదవుల్లో పేదలందరికీ ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన యాదవ గర్జన సదస్సు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పెద్దపల్లి మండల కమిటీ ఏర్పాటు

యాదవ హక్కుల పోరాట సమితి పెద్దపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దకల్వల గ్రామానికి చెందిన నర్ల అంజయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా బయ్య కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా పోసాని కుమార్, కార్యదర్శిగా మేకల కృష్ణ, మండల యువజన శాఖ అధ్యక్షుడిగా మేకల కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రవి ఎన్నియ్యారు. నాయకులు ఫకీర్‌యాదవ్, సంపత్, సురేశ్, రాజయ్య, పోచాలు తదితరులున్నారు.

'గోదావరి' వెంట కరకట్ట నిర్మించాలి

- అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సుందిళ్ల నుంచి గోదావరి పరివాహక ప్రాంతం వెంట కరకట్ట నిర్మించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తారు. రెండేళ్లుగా తెలంగాణ, మహారాష్ట్రల్లో అతి భారీ వర్షాలతో ఎస్సారెస్పీ, కడెం, నాందేడ్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి వరద నీరు గోదావరి నదిలో చేరుతోందన్నారు. నది ప్రవాహం పెరడం మూలంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మల్కాపూర్, సప్తగిరి కాలనీ, జనగామ ప్రాంతాల్లోకి వరద నీరు చేరి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో కరకట్ట నిర్మాణంతో ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు.

కార్మిక వాడల్లో స్వచ్ఛమైన నీరందించాలి

సింగరేణి కార్మిక వాడల్లో మిషన్ భగీరథ తరహా స్వచ్ఛమైన తాగు నీటిని సంస్థ యాజమాన్యం అందించాలని ఎమ్మెల్యే కోరారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన పంప్‌హౌస్‌లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి విద్యాసంస్థల్లో ప్రత్యేక సిలబస్

- డైరెక్టర్(పా) బలరాం



డైరెక్టర్(పా) బలరాం

గోదావరిఖని: సింగరేణి విద్యాసంస్థల్లో పర్యావరణంపై ప్రత్యేక సిలబస్‌ను పీఈటీల సారథ్యంలో రూపొందిస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సింగరేణిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు ఆదేశాలు జారీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో పర్యావరణ అవగాహన, చైతన్యంపై ప్రత్యేక సిలబస్ బోధించనున్నట్లు పేర్కొన్నారు. ఏడాది పొడవునా అనేక పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతి తరగతి నుంచి ఒక చురుకైన విద్యార్థిని పర్యావరణ కెప్టెన్‌గా ఎంపిక చేస్తున్నామన్నారు. పాఠశాల లేదా కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్, బర్డ్ వాచర్స్, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖల నుంచి సమాచారాన్ని, బోధనాంశాలను సేకరించి, సిలబస్ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతివారం ఏదో ఒక పర్యావరణహిత కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. వీటిలో క్విజ్, వ్యాసరచన, పర్యావరణ పర్యటనలు ఉంటాయన్నారు. పర్యావరణ సంబంధిత ముఖ్య దినాలను విద్యాసంస్థల్లో ఉత్సవాలుగా నిర్వహించడం, విద్యాసంస్థల్లో ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి ఇప్పటికే పర్యావరణహితంగా మైనింగ్ నిర్వహిస్తోందని, సంస్థ వ్యాప్తంగా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటడంతో ఈ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతోందన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సింగరేణికి లాభాలు



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సింగరేణి సంస్థకు లాభాలు వచ్చాయని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి సింగరేణిని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో సింగరేణి నష్టాల్లో ఉందని, అందుకే బీజేపీ ఆ సంస్థను ప్రైవేటుపరం చేయాలని చూసిందననడం సిగ్గుచేటన్నారు. సింగరేణి 20 ఏళ్లుగా లాభాల్లోనే ఉందని పేర్కొన్నారు. మొన్నటి వరకు బీజేపీతో అంటకాగిన బీఆర్ఎస్ ఎంపీలు 2015లో పార్లమెంటులో ఎంఎండీఆర్ యాక్ట్‌కు మద్దతు తెలిపి, సింగరేణి ప్రైవేటుపరం కావడానికి కారకులయ్యారని మండిపడ్డారు. ప్రధాని మోదీ ప్రభుత్వం నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేస్తోందని, దీన్ని బీఆర్ఎస్ ఎందుకు అడ్డుకోలేకపోయిందని ప్రశ్నించారు. అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయలేదన్నారు. అబద్ధాలు చెప్పిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. నాయకులు ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, తిరుపతి, శ్రీనివాస్, సంపత్, సత్యనారాయణ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

బీపీఎల్ భూముల్లో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించాలి



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

రామగుండం: రామగుండం పట్టణం నడిబొడ్డున నిరుపయోగంగా ఉన్న వేలాది ఎకరాల బీపీఎల్ సంస్థకు చెందిన భూముల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపించాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్‌లో మాట్లాడారు. బీపీఎల్‌కు చెందిన వేలాది ఎకరాల భూములు రైల్వే ట్రాక్‌కు సమీపంలోనే ఉండడంతో కోచ్ ఫ్యాక్టరీకి అనుగుణంగా ఉంటుందని, తద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రైల్వేను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే తీర్చిదిద్దుతున్నారని ఆరోపించారు. రామగుండం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్న క్రమంలో ఇక్కడి రైల్వేస్టేషన్‌లో పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్స్ కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే సకల హంగులతో కాంగ్రెస్ హయాంలో నిర్మించిన రైల్వేస్టేషన్‌కు కోట్లాది నిధులు వెచ్చించి ఆధునికీకరిస్తామని పేర్కొనడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. స్టేషన్‌కు చేరుకునేందుకు ఇరువైపులా రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాల్సి ఉన్నా ఒకే వైపు అభివృద్ధి చేయడం సరికాదన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మరో ఇద్దరికి తృటిలో తప్పిన ప్రాణాపాయం
- వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్నేహితుల దినోత్సవం రోజే మిత్రున్ని కోల్పోయామని కన్నీరు
- గాడుదుల గండి ఘాట్‌పై ఘటన



సంపత్‌రెడ్డి మృతదేహం



రోదిస్తున్న మృతుడి తల్లి, భార్యాపిల్లలు

మంథని: మిత్రులతో కలిసి వాకింగ్‌కు వెళ్లి, తిరిగివస్తుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. స్నేహితుల దినోత్సవం రోజే తమ మిత్రున్ని కోల్పోయామంటూ వారు కన్నీరు పెట్టుకున్నారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్‌కు చెందిన మల్ల సంపత్‌రెడ్డి(42), గుడిమల్ల సుమన్, అడిచర్ల రమేశ్‌లు స్నేహితులు. నిత్యం గ్రామ సమీపంలోని గాడిదుల గండి ఘాట్ వైపు వాకింగ్‌కు వెళ్తుంటారు. ఆదివారం ఉదయం కూడా వెళ్లారు. తిరిగి వస్తుండగా మంథని వైపు నుంచి కాటారం వైపు వేగంగా వెళ్తున్న కారు సంపత్‌రెడ్డిని ఢీకొట్టింది. దీంతో అతను దూరంగా ఎగిరిపడి, అక్కడికక్కడే మృతిచెందాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనంతరం కారు కొద్ది దూరంలో నిలిచిపోయి, తర్వాత వేగంగా వెళ్లిపోయిందని పేర్కొన్నారు.

ఇద్దరికి ప్రమాదం తప్పించిన వేపచెట్టు

ప్రమాదానికి ముందు రోడ్డు పక్కన వేప చెట్టు విరిగి ఉండటంతో సుమన్, రమేశ్ అటుగా జరిగి, పరిశీలిస్తున్నారు. ఇంతలోనే ఎదురుగా కారు దూసుకువచ్చి సంపత్ రెడ్డిని ఢీకొట్టింది. తాము చెట్టువైపు చూడకపోయి ఉంటే చనిపోయేవాళ్లమని వారు తెలిపారు.

పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం

మల్ల రాధమ్మ–శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఒక కూతురు, కుమారుడు సంతానం. శ్రీనివాస్‌రెడ్డి పదేళ్ల క్రితమే మృతిచెందగా రాధమ్మ అనారోగ్యానికి గురైంది. ఆ కుటుంబానికి సంపత్‌రెడ్డి పెద్ద దిక్కుగా ఉన్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంథనిలోని ఓ ప్రైవేటు బ్యాంకులో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతని అకాల మరణంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మృతుడి బంధువులు, గ్రామస్తుల ధర్నా

సంపత్‌రెడ్డి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు, స్థానికులు ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. గంటపాటు రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో మంథని ఎస్సై కిరణ్, ఇన్‌చార్జి సీఐ వేణుగోపాల్ అక్కడికి చేరుకొని, బాధితులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1995–96 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఫంక్షన్‌హాలు వేదికైంది. 27 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి మిత్రులను కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, ఆనందం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రోజంతా సందడి సందడిగా గడిపారు. కార్యక్రమంలో అడువాల తిరుపతి, అమరగాని పురుషోత్తం, దీకొండ వెంకటేశ్, మేరుగు రమేశ్, ఎండీ.సమదుల్లా, శ్రీకాంత్, నిరంజన్, నాగరాజు, వడ్లకొండ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.